


9న 'వికాస్' ఆధ్వర్యంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-అమలాపురం

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 9న వికాస ఔట్సోర్సింగ్ జిల్లా సంస్థ వారి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహి స్తున్నట్లు జిల్లా కలెక్టర్ రావిలాల మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా కార్యాలయము నందు జాబ్ మేళా నిర్వహించను న్నట్లు ఆయన తెలిపారు. ఐటెక్ సాఫ్ట్వేర్ సొల్యూషన్ అమలాపురం నందు ట్రయినీ డెవలపర్‌గా బిఎస్‌సి, బిసిఎ, బిటెక్ కోర్సులో విద్యాభ్యాసం పూర్తి చేసి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. జిల్లాలో గల అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వివరాల కొరకు వికాస అవుట్సోర్సింగ్ సంస్థ జిల్లా మేనేజర్ గోళ్లరమేష్ వారిని ఫోన్‌నెంబర్ 7989 057588 నందు సంప్రదించవచ్చని అన్నారు.

అమ్మకు వందనం చేస్తారా..!

- గత ప్రభుత్వం అమ్మ ఒడి పేర అమలు
- విద్యాసంవత్సరం ప్రారంభైనా ఊసెత్తని ఎన్‌డిఎ సర్కారు
- ఆశగా ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అమ్మకు వందనం పథకం లబ్ధికోసం జిల్లా వ్యాప్తగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని 2019-2020 విద్యా సంవత్సరం నుంచి 2022-23 విద్యాసంవత్సరం వరకూ వరుసగా నాలుగేళ్ల పాటు ఈ పథకాన్ని అమలుచేసింది. తొలి ఏడాది జనవరి 9న ప్రారంభించగా అదే ఏడాది కరోనా విజృంభించింది. దీంతో అప్పటికి పాఠశాలల నిర్వహణ లేకపోయినప్పటికీ ఎంపిక చేసిన వారందరికీ అర్హులుగా చేర్చి అమ్మఒడి అందజేసింది. రెండో ఏడాది 2021 జనవరి 9న అమలు చేసి నిబంధనల కొర్రీ విధించింది. విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరి చేసింది. మూడో ఏడాది 2022 జూన్ 7న, నాలుగో ఏడాది 2023 జూన్ 28న అమ్మఒడి పథకం నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూలు, కళాశాలల ఫీజులతో పాటు పుస్తకాలు, ఇతర స్టేషనరీ ఖర్చులతో సతమతమవుతున్నారు. టిడిపి అధినేత ఎన్నికల ముందు ప్రకటించిన అమ్మకు వందనం కోసం ఎదురు చూస్తున్నారు.


గతేడాది 1,55,768 మందికి లబ్ధి

2022-2023 విద్యా సంవత్సరానికి గానూ 1,55,768 మంది తల్లుల ఖాతాల్లో 233 కోట్ల నగదు జమజేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. 2021-2022 సంవత్సరానికి గానూ 2.228 కోట్లు జమ చేశారు. ఉమ్మడి జిల్లాలో 2019-20, 2020-21లోనూ అమ్మఒడి పథకం ఫలాలు లబ్ధిదారులకు గత ప్రభుత్వం అందించింది. అయితే తొలి ఏడాది రూ.15,000 చొప్పున జమ చేసి ఆపై వివిధ కారణాలతో పాఠశాల నిర్వహణ ఖర్చుల పేరుతో కోత విధించింది.

తల్లిదండ్రుల ఎదురు చూపులు

ఇప్పటికే తమ పిల్లలను అప్పో సొప్పో చేసి తమ పిల్లలను ప్రైవేట్ ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో చేర్పించారు. ఎన్నికల మేనిఫెస్టోలో టిడిపి ప్రభుత్వం 'అమ్మకు వందనం' పేరుతో ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి అందజేస్తామని తెలిపింది. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడిచింది. రెండు సార్లు కేబినెట్ సమావేశం నిర్వహించారు. అయితే 'అమ్మకు వందనం'పై ఇంత వరకూ విధి విధానాలు నిర్ణయించలేదు. ఈ పథకంపై కేబినెట్‌లో చర్చ కూడా నిర్వహించిన దాఖలాలు లేవు. కనీసం ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం దీని ఊసే ఎత్తలేదు. గత ప్రభుత్వంలో పాఠశాలలు తెరిచిన తర్వాత అమ్మఒడి పథకాన్ని అందించింది. ఆ డబ్బులతో ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులు చెల్లించుకునే అవకాశం ఉండేది. ఈ ఏడాది పరిస్థితిపై తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విద్యా సంవత్సరం అమలు చేయబోయే అమ్మకు వందనం పథకం లబ్ధిదారుల సంఖ్య రెట్టింపు కానుంది. ఒకే ఇంట్లో ఎంత మంది పిల్లలు స్కూలు, కాలేజీకి పంపించినా వారందకీ అమ్మకు వందనం అమలు చేస్తామని ఎన్నికల ముందు టిడిపి అధినేత ప్రకటించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో జిల్లాలో గత ప్రభుత్వం అందజేసిన గణాంకాలను బట్టి పోల్చి చూస్తే సుమారు రూ.500 కోట్ల వరకూ అందజేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకూ ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి విధి విధానాలు జిల్లా విద్యాశాఖకు రాలేదు. కేవలం ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థులకే ఈ పథకాన్ని అమలు చేస్తారా..? లేక ప్రైవేట్ విద్యా సంస్థలలో చదివేవారికీ అమలు చేస్తారా..? అనే సందేహం తల్లిదండ్రులను వెంటాడుతోంది. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావును వివరణ కోరగా త్వరలోనే విధి విధానాలు రానున్నాయని తెలిపారు.



కార్మికులను తొలగించొద్దని సిఐటియు విజ్ఞప్తి

ప్రజాశక్తి-ఐ.పోలవరం

ప్రభుత్వ స్కూల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను, శానిటేషన్ వర్క్‌లను తొలగించొద్దు అంటూ సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ మురమళ్ళ క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజును కలిసి విజ్ఞప్తిచేశారు. కాట్రేనికోన మండలం సిఐటియు నాయకులు విప్పర్తి మోహన్‌రావు, విత్తనాల రాంబాబు కలిసి కాట్రేనికోన మండలంలో మధ్యాహ్న భోజనం కార్మికులు, స్కూలు కంటిజెంటి వర్కర్ సమస్యపై వివరించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, పల్లిపాలెం, కొప్పుగుంట, బలుసుతిప్ప ప్రభుత్వ స్కూళ్లలో పనిచేస్తున్న మధ్యాహ్నం భోజనం కార్మికులను, శానిటేషన్ వర్కర్లను తొలగించి టిడిపి కార్యకర్తలను వేస్తామని స్థానిక టిడిపి పార్టీ నాయకులు ఇబ్బందులు పెడుతున్నారని ఇది సరైన పద్ధతి కాదని ఇప్పటికే స్థానిక నాయకులు చెప్పినప్పటికీ వినడం లేదని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజుకు వివరించారు. దీనిపై ఎంఎల్ఎ సుబ్బరాజు సానుకులంగా స్పందించి నేను స్థానిక నాయకులతో మాట్లాడుతానని అన్నారు. అనంతరం మర్యాద పూర్వకంగా కలిసి వినత పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం కార్మికుల మండల నాయకులు బొంతు పార్వతి, గుత్తుల కనకదుర్గ, శానిటేషన్ వర్కర్ యూనియన్ మం డల నాయకులు కె.వెంకటలక్ష్మి, గిడ్ల రత్నకుమారి,కొప్పనాతి వీర వేణి, చీకురుమల్లి శాంతి, నీరుపూడి భారతి తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్ఎ దాట్లను పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న కార్మికులు

ఉచిత ఇసుక అమలుకు కార్యాచరణ సిద్ధం

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా వ్యా ప్తంగా ఈనెల 8వ తేదీ సోమవారం నుంచి ఆరు ఇసుక స్టాక్ పాయింట్లు నుంచి ఉచిత ఇసుక విధానం- 2024 ను అమలు చేయడానికి కార్యాచరణ సిద్ధమైందని జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ అధ్యక్షులు ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని తొలుత స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక నిల్వలను నిర్దేశిత ధరకు విక్రయిస్తూ ప్రభుత్వానికి ఆదాయం లేకుండా తవ్వకాల ఖర్చు, సీనరేజ్ జీఎస్టి మాత్రమే నామమాత్రంగా రూ.245 వసూలు చేయాలన్నారు. అక్రమ తవ్వకాలు, రవాణా జరగ కుండా నిఘా ఉంచాలన్నారు. వాగులు, వంకల్లో ఎడ్ల బండిలో తవ్వితెచ్చుకునేం దుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. నేటి ఉచిత ఇసుక విధానం అమల్లోకి రానుందన్నారు. తొలుత జిల్లాల్లోని నిల్వ కేంద్రాల్లో ఉన్న ఇసుక డంప్ నుంచి ఇసుకను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించి ందన్నారు.ప్రభుత్వం ఎటువంటి రాబడి తీసుకోకుండా నిర్వహణ ఖర్చులు, సీనరేజ్ మాత్రమే వసూ లుచేసి ప్రజలకు అందజేయ నుందన్నారు. జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ అధ్యక్షులు సూచనల మేరకు పర్యవేక్షణ వ్యవస్థ పని చేస్తుందని తెలిపారు. నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు చేయకుండా విజిలెన్స్ అండ్ ఎన్ఫో ర్స్మెంట్ ద్వారా నిఘా ఉంటుందన్నారు. నిల్వ కేంద్రం నుంచి తరలించే ఇసుకకు వేబిల్లులు జారీచేస్తార న్నారు. నిర్వహణ ఖర్చులతో పాటుగా 18శాతం జిఎస్‌టి కలిపి జిల్లాలో స్టాప్ యార్డ్‌ల నుంచి టన్నుకు రూ.245 వసూలు చేయడానికి నిర్ణయించినట్లు ఆయన స్పష్టం చేశారు. నిల్వ కేంద్రాల్లో ఇసుక ధర తెలిసేలా బ్యానర్లు ఏర్పాటు వేస్తారన్నారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ ధరల ప్రకారం కొత్తపేట, కపిలేశ్వరపురం జొన్నాడ తాతపూడి, రావులపాలెం-1, రావులపాలెం-2ల్లో తవ్వకాలు ఖర్చు, సీనరేజీ, జిఎస్‌టికి సంబంధించి నామమాత్రంగా టన్ను ఇసుకకు రూ.245 చొప్పున వసూలు చేస్తు న్నట్లు తెలిపారు. జిల్లాలోని 6 స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వ లు ఉన్నాయని వీటిలో రావులపాలెం-1 నందు 33,888 టన్నులు, రావులపాలెం-2 నందు 82,089 టన్నులు, కొత్తపేట నందు 25,898 టన్నులు, జొన్నాడ నందు 10,590 టన్నులు, తాతపూడి నందు 31,478 టన్నులు, కపిలేశ్వరపురం స్టాక్ యార్డ్ నందు 60,188 టన్నులు వెరసి 2,44,131 టన్నులు ఇసుక నిల్వలు ఉన్నట్లు ఆయన తెలిపారు. 7వ స్టాక్ యార్డ్ ఆలమూరు నందు ఇసుకలో సిల్ట్ శాతం ఎక్కువగా ఉన్నందున భవన నిర్మాణాలకు పనికిరాదని నిర్ధారణ కావడంతో స్టాక్ యార్డ్‌లో అమ్మ కాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు.

మంత్రిని కలిసిన ప్రయివేటు స్కూల్స్ యాజమాన్యాలు

ప్రజాశక్తి-రామచంద్ర పురం

జోనల్ ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కార్యవర్గ సభ్యులు ఆదివారం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జోనల్ అసోసియేషన్ కార్మిక శాఖ మంత్రి సుభాష్‌కు బడ్జెట్, స్కూల్స్ యొక్క సమస్యలను వివరించారు. మంత్రి స్పందిస్తూ సంబంధిత రాష్ట్ర అధికారులతో మాట్లాడి ప్రయివేటు స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు లయన్ జివి.రావు, అధ్యక్షులు దొడ్డా సత్తిబాబు, నియోజకవర్గ అధ్యక్షులు ప్రగతి రాంబాబు, గురుదేవ్ గిరీష్ ప్రభు, పట్టణ అధ్యక్షులు, సన్ షైన్ సురేష్, సెంటెఎన్ గ్లోరియా శ్రీకాంత్, పామర్రు బాబు, ద్రాక్షారామ విజయ్‌కుమార్, వైష్ణవి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సుభాష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రయివేటు స్కూల్స్ యాజమాన్యాలు

నేడు యథావిధిగా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు యథావిధిగా నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లా డివిజన్ మండల స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని అన్నారు.

స్థల ఆక్రమణపై మంత్రిని కలిసిన వృద్ధురాలు

బాధితురాలికి న్యాయం చేయాలని మంత్రి సుభాష్ ఆదేశం

ప్రజాశక్తి-రామచంద్రపురం

తన స్థలం ఆక్రమణకు గురైందని బాధితురాలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వద్ద గోడు వెళ్లబుచ్చుకుంది. వివరాలు ఇవి.. కె.గంగవరం మండలం కోటిపల్లి గ్రామంలో గల ఆరాధ్రి అంజనీకుమారి అనే వద్ధురాలి స్థలం కొంతమంది కబ్జా చేశారు. ఆ స్థలంలో షెడ్డు నిర్మించి అడిగినందుకు ఆమెను బెదిరిస్తున్నారని ఆదివారం ఉదయం ఆమె మంత్రి ఇంటికి వెళ్లి తన గోడు వెళ్లబుచ్చుకుంది. దీనికి స్పందించిన మంత్రి వెంటనే కోటిపల్లి వెళ్లి ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమించుకున్న ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అంజని కుమారి కి ధైర్యం చెబుతూ తక్షణం ఆమెకు న్యాయం జరగాలని పోలీస్, రెవెన్యూ శాఖలకు సూచించారు. స్థలాలు ఆక్రమణ దారులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సుభాష్ ఆదేశించారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి సుభాష్



ఆక్రమణలకు గురైన స్థలం ఇదే

హామీలు నెరవేర్చేందుకు కృషి

ఎంఎల్ఎ బండారు

ప్రజాశక్తి-ఆలమూరు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి కృషి చేస్తున్నామని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని పెనికేరు, నవాబుపేటలలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులతో కలసి ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సత్యానందరావు మాట్లాడుతూ మేనిఫెస్టో ప్రకారం జులై 1న పెంచిన పెన్షన్ ఇంటికి తీసుకొచ్చి అందించామన్నారు. గత ప్రభుత్వం రైతులకు బకాయి పెట్టిన రూ.1690 కోట్లలో రూ.1000 కోట్ల మూడు రోజుల్లో విడుదలవుతాయన్నారు. ఇక గుంతల రోడ్లను తాత్కాలిక మరమ్మతులు చేయడానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వంటిపల్లి పాపారావు, మెర్ల గోపాలం, ఈదల సత్తిబాబు, ఒంటిపల్లి సతీష్, కోనా శ్రీనివాస్, ఈదల నల్లబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపేట ఎంఎల్ఎ సత్యానందరావు

కార్టూ'నిజం'



సీతమ్మ గృహాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-అంబాజీపేట

లంకల గన్నవరంలో డొక్కా సీతమ్మ గృహాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కోనసీమ ఆహార నిధి వ్యవస్థాపకులు వీరంశెట్టి సతీష్ కోరారు. పి గన్నవరం ఆక్విడెక్ట్ వద్ద సీతమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇరుసుమండలో వారు మాట్లాడుతూ అన్నా క్యాంటీన్లతో పాటు డొక్కా సీతమ్మ క్యాంటీన్లు ఉంటాయని ప్రకటించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు కోనసీమ ఆహార నిధి తరపున కృతజ్ఞతలు తెలిపారు. సీతమ్మ ఐదో తరం మనవడు కామేశ్వరరావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌కు కతజ్ఞతలు తెలిపారు. ఆ కార్యక్రమంలో ఆహారనిధి సభ్యులు గట్టెం వీరు, బండారు సురేష్, పోలిశెట్టి పవన్ మహేష్, పండు, చీకట్ల కిరణ్, ఆర్‌కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా గ్రంథాలయ నిర్మాణం

- పనులు ప్రారంభమై తొమ్మిదేళ్లు
- నేటికీ పూర్తికాని గ్రంథాలయ భవనం
- అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న వైనం
- 30,811 గ్రంథాలకు రక్షణ ఏది?

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఒకప్పుడు పాఠకులను, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను, ఎందరో మేధావులను తయారు చేసిన గ్రంథాలయాలు నేడు ఉనికిని కోల్పోతున్నాయి. రామచంద్రపురం పట్టణంలో గల శాఖ గ్రంథాలయం వాటిలో ఒకటి. ఒకప్పుడు విద్యార్థులతో పాఠకులతో నిత్యం కళకళలాడే గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుని ఉనికిని కోల్పోయింది. ఈ తరుణంలో గ్రంథాలయాన్ని పునరుద్ధరించేందుకు 2015లో జిల్లా గ్రంథాలయాల శాఖ రూ.15 లక్షలు ఆధునిక గ్రంథాలయ నిర్మాణానికి కేటాయించింది. సుమారు తొమ్మిదేళ్లయినా నేటికి ఈ గ్రంథాలయ నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో గ్రంథాలయాన్ని చాలీచాలని అద్దె భవనాల్లో నిర్వహించవలసి వస్తుంది. టీవీలు రేడియోలు, సెల్ ఫోన్ల పుణ్యమా అంటూ గ్రంథాలయాలకు విద్యార్థులు, పాఠకులు రావడం తగ్గించడంతో ఇక్కడ ఉన్న గ్రంథాలయాల పుస్తకాలను ఎవరూ పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. 2015లో ప్రారంభమైన గ్రంథాలయ నూతన భవనాన్ని అప్పటి కాంట్రాక్టర్ శ్లాబ్ వరకు వేసి వదిలేశారు. అప్పుడు మంజూరైన నిధులు అంతవరకే వచ్చాయని అతను చెప్పడంతో మళ్లీ ఐదు సంవత్సరాల క్రితం దీనికి రూ.31.95 లక్షలు మంజూరు అయ్యాయని అయితే ఈ నిధులు పీడీ అకౌంట్స్‌లో ఉండిపోవడంతో తదుపరి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిధులు విడుదల కాక ప్రహరీ గోడ కట్టి వదిలేశారు. అప్పటినుండి ఇప్పటివరకు ఈ భవనం పూర్తవుతుందో లేదోనని పలువురు పాఠకులు, విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. అంతంత మాత్రమే ఉన్న పాఠకులు కూడా ఈ అద్దె భవనాలు అక్కడక్కడ మారుతున్న గ్రంథాలయ చిరునామాలు తెలియక తికమక పడుతున్నారు. ఈ గ్రంథాలయంలో ఇప్పటి వరకు 30,811 గ్రంథాలు ఉన్నాయి. వాటిలో ఖగోళ శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలు రామాయణం, భాగవతం వంటి పుస్తకాలు, దేశ నాయకుల రచనలు ముఖ్యమైన ప్రదేశాలకు సంబంధించిన పుస్తకాలు, మ్యాథ్స్, సైన్స్ పుస్తకాలు వీటితోపాటు పరిసరాల విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు, సైన్స్ పరిశ్రమలకు సంబంధించిన పుస్తకాలు, నవల్స్ 150 సంవత్సరాల కితం రాసిన పంచాంగం వంటివి ఉన్నాయని పలువురు చెబుతున్నారు. వెంటనే ఈ గ్రంథాలయాన్ని జిల్లా అధికారులు పట్టించుకోవాలని నూతన భవనాన్ని పూర్తిచేసి విలువైన పుస్తకాలను భద్రపరచాలని, గ్రంథాలయాలకు పూర్వ వైభవం వచ్చే విధంగా కృషి చేయాలని పరిసర ప్రాంతాల ప్రజలు పాఠకులు పదవీ విరమణ చేసిన ఉద్యోగులు కోరుతున్నారు.



అద్దె భవనాల్లో భద్రపరిచిన గ్రంథాలు



నిర్మాణం పూర్తికాని గ్రంథాలయం

అద్దె భవనాల్లో కొనసాగుతున్నాం



పట్టణంలో గల శాఖ గ్రంథాలయం ఆధు నిక భవనం 2015 నుంచి ఇప్పటివరకు పూర్తిగా కాకపోవడంతో గత తొమ్మిదేళ్లుగా అద్దె భవనాల్లో గ్రంథా లయాన్ని నిర్వహించవలసి వస్తుంది. ఈ గ్రంథాల యాన్ని ఆధునిక భవనంలోకి మార్చి అన్ని హంగులు పూర్తి చేయాల్సి ఉంది. నిధులు విడుదల కాక పోవ డంతో పనులు ఆగిపోయాయని దీనిపై జిల్లా అధికా రులు స్పందించి ఆధునిక గ్రంథాలయ భవనాన్ని పూర్తిచేయాలి.

- లైబ్రేరియన్ దడాల వెంకటరమణ

పలుచోట్ల వరినాట్లు ప్రారంభం

ప్రజాశక్తి-రామచంద్రపురం

గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు సాగునీరు సమృద్ధిగా లభించడంతో తొలకరి వరి నాట్లు ప్రారంభమయ్యాయి. వరి నాట్లు ఆకుతీతలతో పంట పొలాలన్నీ రైతులు కూలీలతో కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది దాళ్వా లో మంచి దిగుబడి సాధించిన రైతన్నలు రెట్టించిన ఉత్సాహంతో తొలకరి పంట పనులు ప్రారంభించారు. కొందరు రైతులు బెంగాల్ వ్యవసాయ కూలీలతో నాట్లు వేస్తున్నారు. రైతులు ఇప్పటికే ఆకుమడులు నాట్లకు అర్థం కావడంతో పాటు కొన్ని గ్రామాల్లో పంట దమ్ములు కూడా పూర్తి అయ్యాయి. దీంతో తొలకరి ఉన్నట్లు వేగంగా ప్రారంభమయ్యాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో గల రూరల్ మండలంలో 17వేల ఎకరాలు పంట సాగు అవుతుండగా, కె.గంగవరం మండలంలో 15 వేల ఎకరాల్లో వరి పంటసాగుఅవుతుంది తొలకరి కి అధిక శాతం రైతులు స్వర్ణ రకం ఎంటియు 7029 రకం పండించేందుకు ఎంపిక చేసుకున్నారు. స్వర్ణ రకం అధిక దిగుబడిని ఇవ్వటమే కాకుండా వర్షాలకు తుఫాన్లకు తట్టుకునినిలబడుతుంది. అందుకనే గోదావరి జిల్లాల రైతులు అధిక శాతం స్వర్ణ రకం వరి నాటేందుకు ఇష్టపడతారు. ఈ వారంలో వర్షాలు మరింతగా కురిస్తే తొలకరి వరి నాట్లు మరింత వేగంగా ఊపందుకుంటుంది.రైతులకు అవసరమైన విత్తనాలు చాలా వరకు రైతులు సిద్ధం చేసుకున్నారు. అదే విధంగా సొసైటీలు, కొన్ని రైతు భరోసా కేంద్రాలు విత్తనాలు అందించాయి. పంటదమ్ములు కూడా పలు పూర్తికావడంతో ఈ వారం లో తొలకరి నాట్లు మరింత వేగం పుంజుకుంటాయి. తొలకరి పంట వర్షాలపై ఆధారపడి ఉంటుంది. ఈ వారం లో మరింత వర్ష పాతం నమోదైతే మరింత ముమ్మరంగా నాట్లు కొనసాగుతాయని వ్యవసాయ అధికారులు , రైతులు అంచనా వేస్తున్నారు.



నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు 'దేశంశెట్టి'కి అభినందన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

కోనసీమ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భీమనపల్లికి చెందిన మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు, రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ ఆదివారం ఎన్నికయ్యారు. లక్ష్మీనారాయణ ను భీమనపల్లి కి చెందిన టిడిపి నాయకులు మంచెం బాబి, ఆకేటి పెద్ద, యాళ్ల సత్తిబాబు, చీకట్ల నాని తదితరులు దుశ్శాలువా కప్పి సత్కరించి అభినందించారు. అలాగే రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులైన లక్ష్మీ నారాయ ణకు అమలాపురం ఎంఎల్ఎ అయితా బత్తుల ఆనంద రావు, ఎంపీ గంటి హరీష్ మాధుర్, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, నాయకులు చిక్కం పెద్ద బ్బులు, గుత్తుల నాగేశ్వర రావు, గొలకోటి సత్తిరాజు, చిన్న, పెమ్మిరెడ్డి సత్య నారాయణ అభినందనలు తెలిపారు.



దేశంశెట్టి లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న టిడిపి నాయకులు



హైకోర్టు న్యాయమూర్తికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ డిసి

వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని ఆదివారం ఎపి హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈయనకు ఆలయ డిసి భూపతి రాజు రమేష్ కుమార్ , అర్చకులు ముందుగా ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి పశ్చిమగోదావరి జిల్లా పంగిడిగుడెం చెందిన వడ్లపూడి వెంకట రమణారావు కుటుంబ సభ్యులు రూ.55,250 ఆలయ డిసి భూపతి రాజు కిషోర్ కుమార్ కు అందజేశారు . వీరికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్ర పటాన్ని అందజేసి ఆలయ అభివద్ధికి సహరిస్తున్నందుకు కృతజ్ఞతలు చేశారు.

అయినవిల్లిలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-అయినవిల్లి

అయినవిల్లి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని ఆదివారం ఐ పోలవరం మండలం కేసనకుర్రు పాలెంకు చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజు కుటుంబ సమేతంగా అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించికున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వర స్వామి నిత్యాన్నదానా నిధికి రూ.1లక్ష విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సతీష్ రాజు, ఛైర్మన్ గుత్తుల నాగబాబు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటమును బహూకరించారు.



దాతలకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న అర్చకులు



కాలిపోయిన పాత రికార్డులు

పాత భవనంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - సామర్లకోట

మాధవపట్నం గ్రామ పంచాయతీ భవనం పక్కన శిథిల స్థితికి చేరిన విఆర్ఒ కార్యాలయం భవనం ఆదివారం అగ్ని ప్రమాదానికి గురయ్యింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి వై.శ్రీహరి సమాచారం ప్రకారం భవనం పాడవడంతో ఎవరూ ఉండటం లేదని వెల్నెస్ హెల్త్ సెంటర్ కట్టకముందు ఈ భవనంలో ఎఎన్ఎం ఉండేవారన్నారు. కొత్త హెల్త్ సెంటర్ కట్టిన తర్వాత వారు వెళ్లిపోగా, పాత రికార్డు మాత్రం ఇక్కడ ఉంచారు. ప్రమాదంలో పాత రికార్డు దహనం చేసినట్టు చెప్పారు. కాకినాడ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

గ్రామీణ ప్రాంతాల్లో యువతలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో ప్రావీణ్యత సాధించాలని వైస్ ఎంపిపి మిరియాల రాజా అన్నారు. మర్లావ గ్రామంలో ఆదివారం ఆయన యువకులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామంలో యువతకు క్రీడల పట్ల ప్రోత్సాహం అందించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు.

చాక్లెట్లను పరిమితంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కొన్ని రకాల చాక్లెట్లను తీసుకోవడం ద్వారా పలు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నా వాటిని పరిమితంగా తీసుకోవాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో ఆదివారం అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ చాక్లెట్లు దినోత్సవం పురస్కరించుకుని చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాక్లెట్లలో ఉండే కొవ్వు పదార్థాల వల్ల బరువు పెరుగుతారని తద్వారా మధుమేహం, అధిక రక్తపోటు వంటి దీర్ఘకాలిక రోగాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. చాక్లెట్లు తిన్న తర్వాత నోరు శుభ్రం చేసుకోకపోతే పళ్లు పుచ్చిపోయే అవకాశం ఉందన్నారు. డార్క్ చాక్లెట్లు, కోకో చాక్లెట్లు ఆరోగ్యానికి మంచివని వీటిని తీసుకోవడం వల్ల రక్తనాళాల్లో రక్త ప్రసరణ క్రమబద్ధం అవడంతో పాటు బిపి అదుపులో ఉంటుందని అన్నారు. ఈ చాక్లెట్లు గుండెకు మేలు చేస్తాయని డాక్టర్ అడ్డాల తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ కె.వెంకటరమణ, కుమార్ యాదవ్, రాజా, సత్యనారాయణ, చంద్రరావు, రాఘవరావు పాల్గొన్నారు.



ఎంపీ హరీష్‌ను అభినందిస్తున్న జోగేష్

ఎంపీ హరీష్‌కు అభినందన

ప్రజాశక్తి-అయినవిల్లి

ఎంపీగా రికార్డు స్థాయి విజయం సాధించటమే కాక పార్టీ విప్‌గా ఎంపికైన ఎంపీ హరీష్ మాధుర్‌ను లీగల్ సెల్ అధ్యక్షుడు బడుగు భాస్కర్ జోగేష్ అభినందించారు. ఎంపి హరీష్ మాధుర్ ఎంపిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జిల్లాలో ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి అమలాపురం నియోజకవర్గం మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా తాళ్ళరేవు వద్ద జోగేష్ ఎంపీ హరీష్ మాధుర్ ను కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా హరీష్ మాధుర్ బాలయోగి మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెచ్ఆర్‌డి మెంబర్ నేదునూరి వీర్రాజు, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు మోర్త సత్తిబాబు, మాజీ సర్పంచ్ గుమ్మళ్ళ సాగర్, బి.వెంకటేష్, పి.నాని, బి.అధీర్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో రజకులకు ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి -ముమ్మిడివరం

నామినేటెడ్ పదవుల భర్తీలో రజకులకు ప్రాధాన్యత కల్పించాలని ముమ్మిడివరం మండల రజక సంఘం డిమాండ్‌చేసింది. నగర పంచాయతీ పరిధిలోని రజక వీధి లోని కమ్యూనిటీ హాలు నందు ఆదివారం సంఘం అధ్యక్షుడు ముమ్మిడివరపు రాంబాబు అధ్యక్షతన మండల రజిక సంఘ సమావేశం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి విజయానికి రజకులంతా పూర్తి సహకారం అందించారన్నారు. దీనిని దష్టిలో ఉంచుకుని నామినేటెడ్ పదవుల్లో రజకులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. అలాగే రజకులపై జరిగే దాడులు అరికట్టాలని, రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. దేవాలయాల్లోనూ, ప్రభుత్వ ఆసుపత్రిలోనూ, ప్రభుత్వ కార్యాలయంలోనూ వస్త్రాలు శుభ్రపరిచే దోబి కాంట్రాక్ట్‌ను రజకులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేశనకుర్తి సుబ్రహ్మణ్యం, కేశనకుర్తి సురేష్, నడవపల్లి వీర వెంకట సత్యనారాయణ, కమిడి నాగేశ్వరరావు, కమిడి మణికంత, రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మరిడమ్మ జాతరలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - పెద్దాపురం

37 రోజులపాటు జరిగే పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతరకు మొదటి ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు రావటంతో ఆలయ పరిసరాలన్నీ జనంతో నిండిపోయాయి. క్యూలైన్లలో గంటల తరబడి యాత్రికులు ఇబ్బందులు పడకుండా వేగవంతంగా దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహన్ రావు పర్యవేక్షణలో సిబ్బంది యాత్రికులకు సేవలు అందించారు. ఆలయం పక్కనే ప్రధాన రహదారి ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా ఎస్ఐ వి.సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు ఆధ్వర్యంలో సానిటరీ సిబ్బంది ఆలయ పరిసరాలన్నీ పరిశుభ్రం చేశారు.



మరిడమ్మ ఆలయంలో యాత్రికుల రద్దీ

నిరంతర సేవకుడే నాయకుడు...

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎవరైనా నాయకుడు అవ్వాలనుకుంటే నిరంతరం సేవకునిగా పని చేయాలని లయన్స్ అంతర్జాతీయ సమాఖ్య మల్టిపుల్ జిఎల్‌టి కో ఆర్డినేటర్ జివిఎస్.రాజు అన్నారు. తాళ్ళరేవు సూర్య భాస్కర కల్యాణ మండపంలో పూర్వ తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చోడే శ్రీనివాస్ అధ్యక్షతన తాళ్లరేవు, గొల్లపాలెం, తూరంగి, అమలాపురం కోనసీమ లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగ నూతన కార్యవర్గ ప్రతిష్టాపకులుగా రమేష్ రాజు కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేయించి, దిశా నిర్దేశం చేశారు. లయన్స్ క్లబ్‌లో చేరడం ద్వారా సమాజానికి సేవ చేయడంతో పాటు, వ్యక్తి తనను తాను సంస్కరించుకోవచ్చుని చెప్పారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న కౌమారదశలో ఉన్న బాలికలలో శారీరకంగా కలిగే మార్పుల వల్ల సమాజంలోని దుష్టశక్తుల బారిన పడకుండా వారిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కౌమార దశ బాలికల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.



నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగిస్తున్న రమేష్ రాజు

గోపాలపురంలో భారీ వర్షం

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం మండలంలో ఆదివారం తెల్లవారు జామున భారీ వర్షం నమోదైంది. 77.6 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపునీటికి చెరువులు పొంగిపోర్లాయి. స్థానిక ఉప్పరగూడెంలో కోమటికుంట రోడ్డులో పంచాయతీ రాజ్ రోడ్డు ఆనుకొని డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం రోడ్లపై నుంచి భారీగా నీరు ప్రవహించింద.ఇ ఇళ్లల్లోకి చేరడంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కోమటికుంట పంట పొలాల్లో నీరు రోడ్డుపైకి వస్తుదని వారు తెలిపారు. డ్రెయినేజీలు ఆక్రమణకు గురవ్వడంతో ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు చెబుతున్నారు. ఉప్పరగూడెం శివారులో రోడ్డుల్లో డ్రెయినేజీ లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఇంటిలోకి వచ్చిన వర్షం నీరు



జలమయమైన రహదారి

ఉచిత ఇసుక విధానం అమలుకు చర్యలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసేం,దుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రామచంద్రపురం ఆర్‌డిఒ ఎస్.సుధాసాగర్ ఆదేశించారు. మండలంలో తాతపూడి కపిలేశ్వరపురం వద్ద ఉన్న రెండు ఇసుక స్టాక్ పాయింట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గతంలో ప్రయివేటు ఏజెన్సీల ద్వారా జరిగిన స్టాక్ పాయింట్లను పరిశీలించామన్నారు. కపిలేశ్వరపురం తాతపూడి లో రెండు ఇసుక స్టాక్ యార్డులు ఉన్నాయని సోమవారం నుంచి ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు, కొత్త సాండ్ పాలసీ మేరకు ఎల్ల నిర్మాణాల కోసం ఇక్కడ నుంచి ఇసుక అలాట్ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకోసం వెహికల్స్ వచ్చే వెళ్లేందుకు లారీ లోడింగ్, తదితర పనులు జరుగుతున్నాయని, స్థానికంగా లోడింగ్ చేయడం, ట్రాన్స్ పోర్ట్ కోసం ఏజెన్సీలను చూడడం జరుగుతుందన్నారు. జిల్లాస్థాయి శాండ్ కమిటీలో వీటి చార్జెస్ ఫైనల్ చేస్తారన్నారు. ఇసుక సరఫరా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు జరుగుతుందని, ఇసుక నిల్వల కేంద్రాల్లో సిసి కెమెరాలు నిఘాలో ఉంటాయన్నారు. ఇసుక నిల్వ కేంద్రాల వద్ద రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఆర్‌డిఒ సుధా సాగర్ వెంట తహశీల్దార్ రాజరాజేశ్వరి, ఆర్ అండ్ బి శాఖ డిఇ సూర్యనారాయణ, ద్రాక్షారామ, మండపేట ఎఇలు కిషోర్ కుమార్, ఫణి లింగేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఎఇ సలీం రాజు, విఆర్ఒలు సత్యనారాయణ, శ్రీనివాసరావు, ప్రసాద్, జాన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



కపిలేశ్వరపురం ఇసుక స్టాక్ పాయింట్ ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సుధాసాగర్

ఘనంగా ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల ఆదివారం ఎమ్ఆర్‌పిఎస్ ఆవి ర్భావ దినోత్సవాన్ని ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు నిర్వంచారు.

ముమ్మిడివరం : ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు అవరణలో ఆదివారం ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఖండవిల్లి ఏలీయా అధ్యక్షతన నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వికలాంగుల రాష్ట్ర కమిటీ నాయకుడు నల్లమాటి లంక రాజు ఎంఆర్ పిఎస్ జెండాను ఆవిష్కరించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ ద్వారానే మాదిగ కులాల అభివద్ధి సాధ్యమవుతుందన్నారు.కార్యక్రమంలో పెదపూడి రుక్మిణి, ఆకుమర్తి సాయికష్ణ, ఉండ్రాజవరపు కష్ణమూర్తి, అయినవిల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** ఎమ్ఆర్‌పిస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మండల కన్వీనర్ ముసూడి నాగప్రభాకర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్ఆర్‌పిఎస్ ఉద్యమం వలన బడుగు, బలహీన వర్గాలకు, వికలాంగుల కు, వయోవృద్ధులకు, వితంతువులకు మేలు చేకూరిందన్నారు. ఈ సందర్భముగా ఎమ్ఆర్‌పిఎస్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలోజనసేన మండల అధ్యకులు జాలెం శ్రీనివాస రాజా, మండల మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షులు తొత్తరమూడి శ్రీను, ఎంఎస్‌పి రాజోలు నియోజకవర్గం గౌరవ అధ్యక్షులు చెట్ల నాగేశ్వరావు, టిడిపి ఉపాధ్యక్షులు చెట్ల ధనమయ్య తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** ఆత్రేయపురం గ్రామం బులిపేటలో ఆదివారం డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మంద కృష్ణ మాదిగ 59వ పుట్టినరోజు వేడుకలు మరియు ఎమ్ఆర్‌పిఎస్ ఆవిర్భవించి 30వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. **ఉప్పలగుప్తం:** ఎమ్ఆర్‌పిఎస్ నంగవరంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్ఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు సత్తాల దుర్గారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దండోరా పతాకాన్ని ఆవిష్కరించారు.



ముమ్మిడివరంలో ఎమ్ఆర్‌పిఎస్ దినోత్సవం

ఆల్ట్రాటెక్‌లో జరిగిన ప్రమాదంపై మంత్రి ఆరా

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడలో ఆదివారం ఆల్ట్రాటెక్ కంపెనీలో జరిగిన ప్రమాద సంఘటనపై ఎపి కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం ఆరా తీశారు. ఈ విషయమై ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలు గుర్తించి తగు నివేదిక సమర్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ఆయన తన కార్యాలయం నుంచి సమాచారం తెలుసుకున్నారు. సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శిస్తానని ఈ సందర్భంగా మంత్రి సుభాష్ తెలిపారు.

'వెల్ల'ను సందర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వెల్ల గ్రామం లో జరిగిన అంబేద్కర్ విగ్రహం కూల్చివేత సంఘటన స్థలాన్ని రామచంద్రపురం నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం పరిశీలించారు. రామచంద్రపురం నియోజకవర్గం ఇంచార్జ్ కోట శ్రీనివాసరావు మాట్లాడారు. ఇటువంటి సంఘటనలకు పాల్పడినటు వంటి వారిపై పోలీసుల విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అక్కడ ఉన్నవారు కూడా ఎటువంటి ఆవేశాలకు లోను కాకుండా పోలీసులకు సహకరిం చాలన్నారు. జాతీయ నాయకులను అవమానించడం మంచి పని కాదని వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న డిపిఒ రాంబాబు

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం లంకూరులో జరుగుతున్న పారిశుధ్య పనులను డిపిఒ రాంబాబు ఆదివారం పరిశీలించారు. పంచాయతీ పరిధిలో డ్రెయినేజీలు పూడుకుపోవడం, వీధుల్లో చెత్త పేరుకుపోవడంతో ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి నాగసతీష్‌ను సస్పెండ్ చేశారు. నూతన ఇన్‌ఛార్జి కార్యదర్శిగా రేఖపల్లి సుజాతను నియమించారు. ఆమె శుక్రవారం నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ అవినాష్ తో కలిసి గ్రామంలో డ్రెయినేజీల పూడికతీత, పారిశుధ్య పనులు చేస్తున్నారు. డయేరియా నిర్మూలనలో భాగంగా కలెక్టర్ ఆదేశాలతో వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. బ్లీచింగ్ చల్లారు. ఈ పనునలు డిపిఒ పరిశీలించారు.

అర్చకులు ఐక్యతతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన అర్చక సమాఖ్యలను తిరిగి బతికించుకునేలా అర్చకులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని పలువురు అర్చక నాయకులు అన్నారు. తాళ్లపూడిలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఎనిమిది మండలాలు చెందిన అర్చకులు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించారు. జంధ్యాల గంగాధర శర్మ పెద్దింటి రంగబాబు పిలుపుమేరకు జరిగిన ఈ సమావేశంలో తాళ్లపూడి, నల్లజర్ల చాగల్లు, కొవ్వూరు, పోలవరం, దేవరపల్లి, కొయ్యలగూడెం, గోపాలపురం మండలాలు చెందిన అర్చకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అర్చకులు

ఘనంగా ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినం

ప్రజాశక్తి -గోకవరం

గోకవరం సంజీవయ్య నగర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ భవనం వద్ద ఎంఆర్‌పిఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని, ఎంఎస్‌పి వ్యవస్థాపక అధ్యక్షులు మంద కష్ణ పుట్టిన రోజును ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పి నాయకులు శ్రీనివాస్, బొడ్డపాటి వీరచంద్ర, చింతాటి వెంకన్న, చీకట్ల సంతానం ఎంఆర్‌పిఎస్ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో ములపార్తి నాగేశ్వరరావు, చీకట్ల కిషోర్, మోర్తా సోమరాజు, కోడి శ్రీను, తోలేటి సురేష్, అరసాల వెంకన్న, కందుకూరు పెద్ద నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న యువగళం నాయకులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

కొవ్వూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ఏడుకొండలు నడిచి ఎక్కుతామని మొక్కుకున్న నియోజకవర్గం తాళ్లపూడి మండల యువగళం నాయకులు తమ మొక్కును తీర్చుకున్నారు. అన్నదేవరపేటకు చెందిన యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర ఆధ్వర్యంలో తిరుమల వెళ్లి కాలినడకన కొండెక్కి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలని కోరుకున్నామని తెలిపారు. ఈ బృందంలో నాదెళ్ల శ్రీరామ్, మద్దిపట్ల సురేష్, కూచిపూడి గణేష్, బొల్లిన నాగేంద్ర, బొడ్డు కేశవ్, ఉండవల్లి గోపాల్, పత్తిపాటి శశాంక్, అల్లూరి శివ, నిమ్మగడ్డ అశోక్, బొడ్డు చౌదరి, కొడవటి రవికుమార్, డి.రామకృష్ణ, ఐ.సుబ్బారావు ఉన్నారు.

పరీక్షలకు చనిపోయిన చేపల తరలింపు

ప్రజాశక్తి-రామచంద్రపురం

గోదావరి పరివాహక ప్రాంతాలైన యానాం నుంచి కోటిపల్లి వరకూ గల మాసకపల్లి, బ్రహ్మపురి, పిల్లంక, వాసాలరేవు గ్రామాల పరిధిలో భారీ ఎత్తున చనిపోయిన చేపలపై మత్స్యశాఖ అధికారులు నమూనాలు సేకరించారని మత్స్యశాఖ అధికారి జి.గోపి 'ప్రజాశక్తి'కి ఆదివారం తెలిపారు. ఇక్కడ గోదావరి సముద్ర ప్రాంతాల్లో నీటి నమూనాలను, చనిపోయిన చేపలను కాకినాడ మత్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థకు అధికారులు తీసుకువెళ్లారని సోమవారం సాయంత్రానికి దీనిపై నివేదిక వస్తుందన్నారు. దీంతో చేపలు ఎందుకు చనిపోయాయి అనేది స్పష్టం అవుతుందని ఆయన వివరించారు. అయితే శుక్రవారం నుంచి ఆదివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఉండిపోయారని మత్యకార సంఘం నాయకులు దోమ ఆదినారాయణ 'ప్రజాశక్తి'కి తెలిపారు. చేపల మతి పై స్పష్టత వచ్చిన తర్వాత వేటకు వెళ్తామని ఈ సందర్భంగా ఆయన వివరించారు.



నమూనాలను తీసుకువెళుతున్న మత్స్యశాఖ అధికారులు



దాతకు స్వామి చిత్రపటం అందిసున్న సిబ్బంది

నిత్యాన్నదానానికి రూ.10వేల విరాళం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దాత విరాళం అందజేశారు. పెదపట్నం లంక వాసులు కొమ్ముల జగ్గారావు(బుచ్చిబాబు) జ్ఞాపకార్థం వారి సతీమణి వెంకటలక్ష్మి మంగ తాయారు మరియు వారి కుటుంబ సభ్యులు ప్రతి సంవత్సరం ఆషాఢ మాసం బహుళ ద్వాదశి రోజున అన్నదానము జరిపించు నిమిత్తం రూ.10,116 విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. ఆలయ అర్చకులు మరియు ఆలయ సిబ్బంది దాతకు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందజేశారు

అభివృద్ధి పనుల నిర్వహణకు కృషి

ప్రజాశక్తి - పెరవలి

కానూరు అగ్రహారంలో అభివృద్ధి పనులకు కృషి చేస్తానని మంత్రి కందుల దుర్గేష్ తనయుడు తేజ అన్నారు. గ్రామంలోని శ్రీ బాబాజీ పిరమిడ్ ధ్యాన జ్ఞాన మహా యజ్ఞ కార్యక్రమానికి ఆయన ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జనసేన పార్టీకి అద్భుతమైన మెజార్టీ ఇచ్చినందునకు గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసం మాణిక్యం, పత్తిపాటి ప్రసాద్, దాసం సూర్యసుబ్రహ్మణ్యం, సాదా వెంకటేష్, దాసం సూర్యనారాయణ, ఆర్.ప్రసాద్, ఇంటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు